రైలు నుంచి పడి ఒకరి మృతి

తాండూర్, ఆగస్టు 13 : రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తాండూర్ బస్టాండ్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 4.30 గంటలకు ముందు ఆసిఫాబాద్ రోడ్–రేచిని రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్యలో మృత దేహం కనిపించిందన్నారు. మృతుడి వయస్సు సుమారు 35–40 సంవత్సరాలు ఉంటుందని, బ్లాక్ కలర్ ఫుల్ షర్టు, బ్లూ కలర్ లోయర్ ప్యాంటు వేసుకొని ఉన్నట్లు తెలిపారు. కుడి కాలికి బ్లాక్ కలర్ దారం కట్టి ఉందని తెలిపారు. జీఆర్‌పీ ఎస్ఐ టీ సుధాకర్ ఆదేవం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాధులను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

మందమర్రి, ఆగస్టు 13: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని కేకే ఓసీ సమీపంలో సమాధులను ధ్వంసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. స్థానిక యాపల్, అంగడిబజార్ ఏరియాల ప్రజల పూర్వికుల సమాధులను జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో కూలగొట్టారని యాపల్ ఏరియాకు చెందిన మారం రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అందుకు కారణమైన ఊరు మందమర్రికి చెందిన పుస్కూరి పవన్ కుమార్, మరి కొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంప్యూటర్లు చోరీ

కోటపల్లి, ఆగస్టు 13 : కోటపల్లి మోడల్ స్కూల్‌లోని ఏడు కంప్యూటర్లు చోరీకి గురి అయ్యాయి. సెలవు దినాల్లో పాఠశాలలోకి ప్రవేశించిన దొంగలు ఏడు కంప్యూటర్లు చోరీ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తెలిపారు. వీటి విలువ రూ.2.10లక్షలు ఉంటాయన్నారు. ఫిర్యాదు చేయగా చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

గంగారంలో ఇల్లు దగ్ధం

చెన్నూర్ రూరల్, ఆగస్టు 13: చెన్నూర్ మండలంలోని గంగారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తాటికొండ చంద్రయ్యకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వచ్చి మంటలు ఆర్పివేశారు. చెన్నూర్ ఆర్ఐ కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. ఆర్ఐ తెలిపిన ప్రకారం..తాటికొండ చంద్రయ్య తన భార్యతో కలిసి చెన్నూర్‌లోని కూతురు ఇంటికి సోమవారం వెళ్లారు. రాత్రి సమయంలో గ్యాస్ లీక్ అయి ఇంట్లో మంటలు చెలరేగినట్లు తెలిపారు. ఇంట్లో బీరువాలో ఉన్న నగదు రూ. 3.50 లక్షలతో పాటు తులం బంగారం, 7 క్వింటాళ్ల బియ్యం, వెండి పట్టగొలుసులు, ఇంటి సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారుగా రూ. 6 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆర్ఐ తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు. బాధితులను జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి పరామర్శించారు.

బెల్లం పానకం ధ్వంసం

తాండూర్, ఆగస్టు 13 : మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని త్రీ ఇంక్లైన్ ప్రాంతంలో గుడుంబా స్థావరంపై దాడి చేసి 20 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 5 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు మాదారం ఎస్ఐ సౌజన్య తెలిపారు. రెబ్బెన మండలం దేవులగూడకు చెందిన బానోతు రమేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

55 ట్రాక్టర్ల ఇసుక సీజ్

రెబ్బెన, ఆగస్టు 13: రెబ్బెన మండలం దేవులగూడలో మంగళవారం అక్రమంగా నిలువ ఉంచిన 55 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు ఆర్ఐ ప్రేమ్‌కిరణ్ తెలిపారు. దేవులగూడ వద్ద అక్రమంగా తరలించేందుకు ఇసుక సిద్ధంగా ఉందని సమాచారం రావడంతో మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు వెళ్లి పరిశీలించారు. అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఏడీ మైనింగ్ గంగాధర్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

హాజీపూర్, ఆగస్టు 13 : జీవితంపై విరక్తి చెంది హాజీపూర్ మండలంలోని దొనబండ గ్రామానికి చెందిన వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం దొనబండ గ్రామానికి చెందిన రాగుల విమల (85)కు రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. కళ్లు కూడా సరిగ్గా కనిపించక పోవడంతో ఇబ్బంది పడేది. సోమవారం రాత్రి ఇంటి వెనకాల ఉన్న పెరడి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. మృతురాలి పెద్ద అల్లుడు పోలాస గురుచరన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జైపూర్, ఆగస్టు 13: జైపూర్‌లో మంగళవారం ఎస్ఐ శ్రీధర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా మంచిర్యాల వైపు నుంచి చెన్నూర్ వైపు వెళ్తున్న లారీని మద్యం తాగి నడిపుడూ డ్రైవర్ గజానంద్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి చెన్నూర్ కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రవి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు నిరంతరం కృషి

మంచిర్యాలటౌన్, ఆగస్టు 13: వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఎనిమిది నెలలుగా నిరంతరం కృషిచేస్తున్నామని మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 156 ట్రాన్స్‌ఫార్మర్లు, 461 మిడిల్ పోల్స్‌ను ఏర్పాటుచేశామని, అవసరం ఉన్న చోట 3050 కొత్త స్తంభాలను వేశామని, పాతలైన్లను మార్చి కొత్తగా 18 కిలోమీటర్ల మేర లైన్లు వేశామని, లోడ్ పెరిగే అవకాశం ఉన్న రెండు సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 5ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు, 3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏకు పెంచామన్నారు. 91 ఏబీ స్విచ్‌లను అమర్చినట్లు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకే 'పొలం బాట'

తాండూర్, ఆగస్టు 13 : రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకే విద్యుత్ శాఖ పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ రాజన్న పేర్కొన్నారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అచ్చులాపూర్, గంపలపల్లిలో రైతులు, బెల్లంపల్లి ఏడీఈ శ్రీనివాస్, తాండూర్ ఏఈ ప్రభాకర్, సబ్ ఇంజినీర్ కుమార్‌తో కలిసి పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. వంగిన కరెంట్ స్తంభాలను సరిచేయడం, కెపాసిటర్లు బిగించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కన్నెపల్లి, ఆగస్టు 13 : వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు తాండూర్ సీఐ కుమారస్వామి సూచించారు. మంగళవారం కన్నెపల్లిలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు మత్తు పదార్థాలు, డ్రగ్స్, సైబర్‌నేరాల, ఈవ్‌టీజింగ్ నివారణపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా నంబరు, ఓటీపీ నంబర్లు చెప్పవద్దని సూచించారు. తల్లి దండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారాం, పోలీసులు , ఉపాధ్యాయులున్నారు.

డంప్ యార్డు, వీధికుక్కల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్, ఆగస్టు 13: తమ కాలనీకి పక్కనే ఉన్న డంప్ యార్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు వీధికుక్కలతో అవస్థలు పడుతున్నామని మంచిర్యాల పట్టణంలోని అండాళమ్మకాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బీ కిషన్‌తో పాటు వార్డు ప్రజలు ఆర్ శ్రీనివాస్‌రావు, సమ్మయ్య, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, శంకర్, సాయిలు, సతీశ్, కమలాకర్, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

సీసీసీ నస్పూర్, ఆగస్టు 13: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సీసీసీ నస్పూర్‌కు చెందిన సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారు. ఈ నెల 11న మందమర్రిలో తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే అండ్ కుంగ్–ఫూ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సీసీసీ నస్పూర్ విద్యార్థులు అద్వైత్, గున్నిగంటి మణిక్, తుమ్మల ఎడ్మండ్, గునిగంటి చైత్ర, ఇత్తిని రిషిక గోల్డ్ మెడల్ సాధించగా, బిర్కూరి యువన్, బ్లోసమ్ ఇరేని, ఇరికిళ్ల అద్విత సిల్వర్ మెడల్, రెడపాక మన్విత్, రిత్విక్ డొలకుల, పల్లికొండ అభిరాం, విహాని తోట, నిహాన్వి రెడ్డి రామిడి, సెల్వి కలకొండలు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్లు దాసరి రాజేశ్వర్, పోచంపల్లి వెంకటేశ్ తెలిపారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ ఫినిషియా, కరస్పాండెంట్ మేరీ జన్సీ, కో ఆర్డినేటర్ సంగీత అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత

మందమర్రి, ఆగస్ట్ 13 : మందమర్రి పట్టణానికి చెందిన హోంగార్డు భార్య ఇటీవల గుండెపోటుతో చనిపోయిన విషయాన్ని తెలుసుకొని పట్టణ పోలీస్ స్టేషన్ కి చెందిన హోంగార్డులు తోటి హోంగార్డ్ ఎండీ రంజాన్‌కు రూ.12,500, 50కిలోల బియ్యం ఎస్ఐ రాజశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు దాసరి శ్రావణ్ కుమార్, దుమ్మటి రాజేశ్, గంధం రమేశ్, చంద్రమోహన్ టీ రమేశ్, హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఎల్ శ్రీనివాస్

జన్నారం, ఆగస్టు 13 : పంచాయతీ కార్యదర్శుల జన్నారం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు ఎల్ శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడుగా ఎల్ శ్రీనివాస్(రేండ్లగూడ), ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ మధుకర్(వెంకటాపూర్, కోశాధికారిగా కే విశ్వశ్రీ(కవ్వాల్), ఉపాధ్యక్షులుగా ఈ కరుణ(కామన్‌పెల్లి), బీ వరలక్ష్మి(లింగయ్యపల్లె), ఎ జంగు (మురిమడుగు), జీ శ్రీకాంత్(మల్యాల), శ్రీపాల్(జన్నారం), ఎస్ సరిత(దేవునిగూడెం),అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్ అంజన్న (హస్టల్‌తండా), జాయింట్ సెక్రటరీగా ఎస్ రమేశ్, సీహెచ్ సాగర్, ఎస్ సంతోష్, ఏ కళ్యాణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జీ వినోద్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా ఏ రమేశ్, ఈసీ మెంబర్‌గా డీ రమేశ్, టీ మహేశ్, ఆర్ రాహుల్, ఎం లావణ్య, డీ లత ఎన్నికైనట్లు తెలిపారు.

అంబులెన్స్ డ్రైవర్ల అతిజోక్యం

- అవయవదానంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు
- ముగ్గురిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు!

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 13 : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన రేవెల్లి శ్రీకాంత్ ఈనెల 6వ తేదీన ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాంత్‌ను ఓ అంబులెన్స్‌లో తాను పనిచేసే మయూరీ ఆసుపత్రికే తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు కరీంనగర్‌లోని భద్రకాళి ఆసుపత్రికి రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో కరీంనగర్‌కు శ్రీకాంత్‌ను తీసుకెళ్తుండగా శ్రీరాంపూర్ సమీపంలో నరేశ్, నానీ, కిరణ్ అనే ముగ్గురు వ్యక్తులు(ప్రైవేటు అంబులెన్స్ ఓనర్లు) అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. మేము శ్రీకాంత్ స్నేహితులమని, తను పనిచేస్తున్న ఆసుపత్రిలోనే పని చేస్తున్నామని శ్రీకాంత్ భార్య స్వప్నను నమ్మించారు. మేము వస్తామని చెప్పి అంబులెన్స్‌లో ఎక్కి భద్రకాళి ఆసుపత్రికి వెళ్తే ఎక్కువ డబ్బులు అవుతాయని, సూర్య ఆసుపత్రికి వెళ్దామని చెప్పారు. తీరా కరీంనగర్‌లోని కెల్విన్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదేంటి సూర్య ఆసుపత్రి అన్నారు ఇప్పుడు మరో ఆసుపత్రికి తీసుకొచ్చారని స్వప్న ప్రశ్నించగా.. అక్కడ సర్జన్ లేడని చెప్పి కెల్విన్ హాస్పటల్‌కు తీసుకొచ్చామన్నారు. అనంతరం శ్రీకాంత్‌ను పరిశీలించిన కెల్విన్ వైద్యులు తలకు బలంగా తాకడంతో మెదడులో నరాలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. దీంతో శ్రీకాంత్ బతికే పరిస్థితి లేదని నరేశ్, కిరణ్, నానీలు అవయాలు దానం చేయాలంటూ కుటుంబ సభ్యులకు సలహా ఇచ్చారు. ఇందుకు కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. అవసరమైతే హైదరాబాద్‌కు వెళ్తామని చెప్పడంతో కెల్విన్ ఆసుపత్రి వైద్యులు యశోద ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడి నుంచి మరో అంబులెన్స్‌లో హైదరాబాద్ వెళ్తుండగా కామినేని ఆసుపత్రి నుంచి శ్రీకాంత్ భార్యకు ఫోన్ వచ్చింది. ''మీ భర్తకు బ్రెయిన్ డెడ్ అయ్యిందంటా, మీరు యశోదకు వెళ్తున్నట్లు తెలిసిందని, అక్కడ డబ్బులు ఎక్కువ అవుతాయి. కామినేనికి రండి ఇక్కడ ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉంది అని చెప్పారు. అక్కడికి వెళ్లిన 24 గంటల తర్వాత వైద్యులు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి చిన్నమెదడు పూర్తిగా చితికి పోయిందని, తను బతకడం కష్టమని చెప్పారు. ఇలాంటి కేసుల్లో చాలా మంది అవయవదానం చేస్తారని ఇలా చేస్తే మరో ఏడుగురికి ప్రాణం పోసినవారవుతారని ఒప్పించారు. దీంతో శ్రీకాంత్ అవయవాలను ఓ సంస్థకు అప్పగించి రూ.3 లక్షలు ఇచ్చారు. ఈ వ్యవహారంలో అంబులెన్స్ డ్రైవర్లు నరేశ్, కిరణ్, నానీలకు పెద్ద ఎత్తున డబ్బులు ముట్టాయనే చర్చ నడుస్తున్నది. ఇది ఆ నోటా, ఈ నోటా శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు చేరడంతో మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ కలవ లేదు.

'హరితహారం' లక్ష్యం పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కనాటి నీరు పోస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్ టౌన్, ఆగస్టు 13 : హరితహారం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను నాటాలని అధికారులను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. చెన్నూర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మండల కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఉపాధిహామీ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, పథకం వివరాలు ఏపీవోను అడిగి తెలుసుకున్నారు. హరితహారంలో భాగంగా లక్ష్యం ప్రకారం నాటిన మొక్కల వివరాలను ఆరా తీశారు. అనంతరం మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ, జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. కిష్టంపేటలో నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజ్మత్ అలీ, ఉపాధిహామీ ఏపీవో, సిబ్బంది, కిష్టంపేట పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

చెన్నూర్ రూరల్, ఆగస్టు 13: చెన్నూర్ మండలంలో అన్ని గ్రామాల్లో ప్రతి రోజూ పారిశుధ్య పనులను చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మండలంలోని కిష్టంపేటలో ఆయన పర్యటించారు. బొమ్మవాడలో పారిశుధ్య పనులను పరిశీలించారు. నీటి ఎద్దడిలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట స్పెషల్ ఆఫీసర్ అజ్మత్ అలీ, ఏపీవో గంగా భవానీ, పం చాయతీ సెక్రటరీ మధూకర్ తదితరులున్నారు.

ఇసుక క్వారీలను సందర్శించిన కలెక్టర్

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

ఇసుక క్వారీ లారీల తూకంను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, ఆగస్టు 13 : నమస్తే తెలంగాణలో ఈనెల 10న 'ఇసుక దందాలో హస్తం' అనే వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మండలంలోని పారుపల్లి సమీపంలోని పలుగుల క్వారీ నంబర్ 4 ఇసుక క్వారీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. లారీల్లో అధిక లోడ్ నింపవద్దని ప్రతి లారీని తప్పనిసరిగా తూకం వేయాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, ఇసుక క్వారీల వద్ద సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఆగస్టు 13 : స్వచ్ఛదనం–పచ్చదనం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అన్ని గ్రామాల్లో పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), డీపీవో భిక్షపతి, డీఎంహెచ్‌వో తుకారాం భట్, డీఆర్డీవో దత్తారాంతో కలిసి హాజరయ్యారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధి దిశగా కృషి చేయాలి

ప్రజా సంక్షేమం, సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధన దిశగా అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి రాజీవ్ సింగ్ అన్నారు. మంగళవారం కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురం నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లోని వెనుకబడిన జిల్లాల్లో ప్రధానమంత్రి గతి శక్తి కార్యక్రమం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, నీతి అయోగ్, ప్రధాన మంత్రి జన్ మన్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా అధికార యంత్రాంగం సమష్టిగా పని చేయాలని తెలిపారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

సీసీ రోడ్లను పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టీ), ఆగస్టు 13 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులకు పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని బీఆర్ ఎస్ నాయకుడు షేక్ చాంద్ ఇంట్లో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయిలో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు బీఆర్ఎస్ నాయకుల గెలుపు అత్యవసరమన్నారు. అనంతరం మండల కేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో పర్యటించారు. సిర్పూర్(టీ) గ్రామ పంచాయతీ పరిధిలో పెద్ద మొత్తంలో అవినితి జరిగిందని ఆరోపించారు. డౌనల్ ప్రాంతంలో సీసీ రోడ్డు వేయకున్నా వేసినట్లు దాదాపు రూ.1.80లక్షల బిల్లులను గ్రామ పంచాయతీ నిధుల నుంచి మాయం చేశారని ఆరోపించారు. వైకుంఠధామం నిర్మాణానికి జీపీ నిధులను వాడుకున్నారన్నారు. దీనిపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మేషన్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాల్వ శివానీ, బెస్తవాడ కాలనీలో ప్రమాదవశాత్తు మృతి చెందిన వగాడే గణేశ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకట్రావ్‌పేట్‌లో బురదమయమైన రోడ్ల ను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట నియోజకవర్గ కన్వీనర్ శ్యాంరావ్, మహిళా కన్వీనర్ లలిత, మండల కన్వీనర్ అస్లాం బిన్ అబ్దుల్, మాజీ ఎంపీటీసీ మంగీలాల్, తరుణ్, పనాస లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కౌటాల, ఆగస్టు 13 : మండలంలోని గుండాయిపేటలో ఇటీవల జ్వరంతో మృతి చెందిన జాడే పూజ, బోయర్ కాళిదాస్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. అండగా ఉంటానని అధైర్య పడొద్దని ఓదార్చారు.

చిన్నారితో సరదాగా కాసేపు..

గుండాయిపేట గ్రామంలో ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్ హోం వర్క్ చేస్తున్న చిన్నోడితో మాట్లాడుతూ కాసేపు తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు ఏం పాఠాలు నేర్పించారు? హోం వర్క్ ఏం ఉంది? ఇలా అడిగి పుస్తకాలను చదివారు. తన బాల్యంలో ఇలాంటి పుస్తకాలు లేవని తాను చదివిన చదువుకు ఇప్పటి చదువుకు చాలా తేడాలు ఉన్నాయని గుర్తు చేశారు.

ఆశ్రమపాఠశాలలో ఏసీబీ అధికారుల తనిఖీలు

వేమనపల్లి, ఆగస్టు 13 : వేమనపల్లి మండంలోని ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆదిలాబాద్ ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగాయి. ఇన్‌చార్జి హెచ్ఎం జ్ఞానేశ్వర్ సమక్షంలో పాఠశాల రిజిష్టర్లు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. హాజరు పట్టికలో 272 మంది ఉండగా 100 మంది వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామని , ఆహారం స్టాక్ రిజిష్టర్‌లో కూడా వ్యత్యాసం గుర్తించినట్లు తెలిపారు. 31 రిజిష్టర్ల జిరాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏసీబీ సీఐలు, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు, కొలతల అధికారులు, పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా విడుదల

బెల్లంపల్లి, ఆగస్టు 13 : బెల్లంపల్లి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గదులకు మొదటి విడుతగా 54 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీ నివాసరావు లబ్ధిదారుల జాబితాను విడుదల చేశారు. సీనియార్టీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 14న సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

హుండీ లెక్కింపు

చెన్నూర్ టౌన్, ఆగస్టు 13 : చెన్నూర్ పట్టణంలోని మదన పోచమ్మ ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్మల్ డివిజన్ పరిశీలకుడు ఎం.రాజమౌళి పర్యవేక్షణలో రూ.5,06,622 నగదు, 18.200 గ్రాముల మిశ్రమ బంగారం, 969 గ్రాముల మిశ్రమ వెండి వచ్చింది. ఈ లెక్కింపులో ఆలయ ఈవో ముక్త రవి, పట్టణ ప్రజలు, భక్తులు, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి : మంచిర్యాల డీఎంహెచ్‌వో

కోటపల్లి, ఆగస్టు 13 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ సూచించారు. కోటపల్లి పీహెచ్‌సీని మంగళవారం తనిఖీచేశారు. రోగుల వివరాలు, ఓపీ సంఖ్యను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ అరుణశ్రీకి సూచించారు. ఇక్కడ ఆయూష్మాన్ ఆరోగ్య కేంద్రం పీవో అనిల్, సిబ్బంది ఉన్నారు.

అక్షరాస్యతతో ఆత్మ విశ్వాసం

మంచిర్యాల డీపీవో వెంకటేశ్వరరావు

కాసిపేట, ఆగస్టు 13 : అక్షరాస్యతతోనే ఆత్మవిశ్వాసంతో ముందువెళ్లగలమని మంచిర్యాల డీపీవో డీ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట మండలంలోని ధర్మారావుపేట రైతు వేదికలో, మల్కేపల్లి గ్రామంలోని ఐకేపీ హాల్‌లో వయోజన విద్యాశాఖ, సఖీ లయన్స్ మంచిర్యాల సౌజన్యంతో నిరక్షరాస్యులైన వయోజనులకు వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యులను చేయడం, ఉచిత కుట్టు శిక్షణపై అవగాహన కల్పించారు. చదువు, స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా సఖీ లయన్స్ మంచిర్యాల, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లను అభినందించారు. వయోజన విద్యకు సహకారం అందిస్తున్న డీఆర్పీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి ఏ.పురుషోత్తం నాయక్, సఖీ లయన్స్ అధ్యక్షుడు, డీఆర్పీ బండ శంకరి, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డీఆర్పీ రెడ్డిమల్ల ప్రకాశం, డీఆర్పీ పోకల వెంకటేశ్వర్లు, డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు శ్రీమతి అన్నపూర్ణ, జగదీశ్, కో ఆర్డినేటర్లు గుండా సంధ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల తనిఖీ

కాసిపేట, ఆగస్టు 13 : మండలంలోని ముత్యంపల్లి, కాసిపేట, కోమటిచేను గ్రామ పంచాయతీలను డీపీవో డీ.వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, సెగ్రిగేషన్ కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. రోజువారీగా పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండి ఎంపీడబ్ల్యూ వర్కర్లతో పారిశుధ్య పనులు చేయించాలని, నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

శ్రీరాంపూర్ /లక్సెట్టిపేట/హాజీపూర్/ వేమనపల్లి/జైపూర్/ ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ /రెబ్బెన, ఆగస్టు 13 : ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లాతో పాటు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బీజేపీ నాయకులు విద్యార్థులతో కలిసి 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలు తీశారు.

సీజనల్ వ్యాధులపై ఆందోళన వద్దు

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 13: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ తెలిపారు. వివిధ దిన పత్రికల్లో జిల్లాలోని గుండాయిపేటలో డెంగీతో ఇద్దరు మరణించారనే వార్తలు అవాస్తవమని, పరీక్షల్లో రుజువు కాలేదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఈ నెల 16 నుంచి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో సంప్రదించేందుకు కంట్రోల్ రూమ్ నంబర్ 9381613858లో సంప్రదించాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కౌటాల, ఆగస్టు 13 : మండలంలోని గుండాయిపేట గ్రామంలో ఇటీవల జ్వరంతో మృతి చెందిన జాడే పూజ, బోయర్ కాళిదాస్ మృతి చెందడంతో వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం పరామర్శించారు. జ్వరాల బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందేలా వైద్యాధికారులతో మాట్లాడుతానని తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి

దహెగాం, ఆగస్టు13: దహెగాం మండలంలోని రోడ్ల దుస్థితి వాటిరి చేపట్టాల్సిన మరమ్మతులపై దహెగాం యువత ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. దహెగాం నుంచి కల్వాడ వెళ్లే రోడ్డుకు మామిడి తోట వద్ద ఒర్రెకు బిడ్జి నిర్మించాలని, దహెగాంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, దహెగాం నుంచి పెంచికల్‌పేట క్రాస్ రోడ్డు వరకు మరమ్మతులు చేపట్టడంతో పాటు దహెగాం నుంచి కోత్మీర్ వరకు డబుల్ రోడ్డు మంజూరైనా పనులు ప్రారంభించలేదని, డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. కొందరు రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు భీమనాథుల విఘ్నేశ్వర్, ఊత్కూరి ప్రదీప్, నికాడి గంగాధర్‌రెడ్డి రాకేశ్, నికాడి కార్తిక్, సొత్కు సాయి, సుంకరి రాజేశ్, కోపిరె శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

కాగజ్‌నగర్, ఆగస్టు 13: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె యాధావిధిగా కొనసాగుతుంది. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పాలకవర్గం సభ్యుల సమక్షంలో మంగళవారం మళ్లీ చర్చలు జరగగా విఫలమవడంతో సమ్మె కొనసాగించారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

సిర్పూర్(టీ), ఆగస్టు 13 : సిర్పూర్(టీ) రైల్వే సమీపంలోని అటవీ ప్రాంతంలో కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు మంగళవారం అటవీ శాఖ రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం ఉదయం కుక్కల దాడిలో గాయపడిన దుప్పికి చికిత్స అందించి అటవీ ప్రాంతానికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు.

ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ నేరం

రెబ్బెన, ఆగస్టు 13:ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, యువత మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ స్పష్టం చేశారు. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడవద్దని సూచించారు. ముఖ్యంగా యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం సివిల్ జడ్జిని కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రకాశ్, జెండర్ స్పెషలిస్ట్ రాణి, అడ్వకేట్లు శ్రీదేవి, వెంకటేశ్వర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

వేతనాలివ్వకపోతే విధులను బహిష్కరిస్తాం

కెరమెరి, ఆగస్టు 13: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ బకాయిలతో పాటు నెలనెల వేతనాలు చెల్లించకుంటే ఈ నెల 20 నుంచి విధులను బహిష్కరిస్తామని మండల కార్మికులు తేల్చి చెప్పారు. మంగళవారం ధనోర ఫిల్టర్ బెడ్‌లో సైడ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సాయి గణేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికుల మండలాధ్యక్షుడు మాచర్ల బుడయ్య, కార్మికులు అంకుష్, సంతోష్, సోను, చరణ్, షర్ఫొద్దీన్, మహిబూబ్ తదితరులు ఉన్నారు.

స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరరంగా తీర్చిదిద్దాలి

రెబ్బెన, ఆగస్టు 13: పోలీస్‌స్టేషన్‌లోని పరిసరాలను ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవరసర పరిస్థితుల్లో బాధితులు చేసే డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలని, పోలీస్‌స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య పేర్కొన్నారు. మంగళవారం స్టేషన్ లోని పలు రికార్డులు తనిఖీ చేయడంతో పాటు సిబ్బంది విధులు, కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సిఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్, ఆగస్టు 13: కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గం శాంతినికేతన్ హై స్కూల్ విద్యార్థులకు మంగళవారం ఈస్గం ఎస్ఐ రామన్‌కుమార్ సైబర్ నేరాలు, యాంటి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అత్యాశతో సైబర్ నేరాలకు గురికావద్దని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దవాఖాన ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

మందమర్రి, ఆగస్టు 13: ఆశ కార్యకర్త సమ్మక్కను వేధింపులకు గురి చేసిన సూపర్ వైజర్ మధు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా చేశారు. న్యాయం జరిగే వరకు విధులకు హాజరు కాబోమంటూ దవాఖాన ఎదుట బైఠాయించారు.

తపాలా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 13 : తపాలా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా తపాలా సహాయ పర్యవేక్షకుడు రాథోడ్ రామారావు కోరారు. మంగళవారం శ్రీరాంపూర్ కాలనీ పోస్టాఫీసులో తపాలా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ తపాలా సబ్ పోస్ట్ మాస్టర్ సందీప్, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

మంచిర్యాలటౌన్, ఆగస్టు 13: మంచిర్యాలలోని తొమ్మిదోవార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత ఆధ్వర్యంలో మంగళవారం వార్డులోని శ్రీలక్ష్మికాలనీలోని పార్కులో మొక్కలను పంపిణీ చేశారు. ఇండ్లలో ఉపయోగపడే పూలు, పండ్ల మొక్కలను ఇంటింటికీ అందించడం జరుగుతుందని, అందరూ నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, కోదాటి కమల, నాయకులు రమేశ్, ఎడ్ల మల్లేశ్, తూముల ప్రభాకర్, ఉరిమెట్ల తిరుపతి, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.